నిధులు కేటాయించాలని వినతి



ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్‌ గంగాధర్‌ రెడ్డి తదితరులు

గచ్చిబౌలి: గచ్చిబౌలి డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించాలని కోరుతూ కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి గురువారం ఎమ్మెల్యే గాంధీని కలిసి వినతిపత్రం సమర్పించారు. సోఫా కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్‌ పలు సమస్యలను గాంధీ దృష్టికి తీసుకెళ్లారు. సీసీ రోడ్లు వేయాలని, పెండింగ్‌ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. అండర్‌గ్రౌండ్‌ డ్రైనేజీ, మంచినీటి పైపులైన్‌ నిర్మాణం చేపట్టాలని సూచించారు. కొన్ని కాలనీలలో వీధి దీపాలు వెలగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో గోపన్‌పల్లి తండా వడ్డెర సంఘం అధ్యక్షులు శ్రీరాములు ,సీనియర్‌ నాయకులు రాజు నాయక్‌, శ్రీనివాస్‌, రఘురాంరెడ్డి, నరేందర్‌ యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో గేమింగ్‌ పరిశ్రమను ప్రోత్సహిస్తాం

ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



ఇండియా గేమింగ్‌ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

మాదాపూర్‌: తెలంగాణలో గేమింగ్‌ పరిశ్రమను ప్రోత్సహిస్తామని తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో మూడు రోజుల పాట నిర్వహిస్తున్న 16 ఎడిషన్‌ ఇండియా గేమ్‌ డెవలపర్‌ కాన్ఫరెన్స్‌కు గురువారం తమిళనాడు ఐటీ శాఖ మంత్రి డాక్టర్‌ పళనివేల్‌తో పాటు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం యంగ్‌ ఇండియా స్కిల్స్‌ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఆరు వర్టికల్స్‌లో కోర్సులను అందిస్తుందన్నారు. ఈ సంవత్సరం 2 వేల మందికి, వచ్చే ఏడాది 10 వేల మందికి శిక్షణ ఇచ్చేందుకు లక్ష్యంగా పెట్టుకుందన్నారు. తెలంగాణలో సెంటర్‌ ఆఫ్‌ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. డెవలపర్‌లకు, గేమింగ్‌ కంపెనీలను నెలకొల్పేవారికి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. కావాల్సిన వసతులను కల్పిస్తున్నట్టు తెలిపారు. భారతదేశంలో ప్రపంచస్థాయిలో గేమింగ్‌ అభివృద్ధి చెందుతుందన్నారు.

ఆర్‌ఎంపీల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ఆర్‌ఎంపీలు

పటాన్‌చెరు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ప్రాథమిక వైద్యం అందించడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్న ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి తెలిపారు. గురువారం డివిజన్‌ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ఆర్‌ఎంపీ, పీఎంపీలు ఎమ్మెల్యేను కలిసి సమస్యలను వివరించారు. ఇటీవల పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో జిల్లా వైద్యాధికారులు తనిఖీలు చేసి పలు ఆర్‌ఎంపీ క్లీనిక్‌లను సీజ్‌ చేశారని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు లోబడి మాత్రమే పని చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రిస్కిప్షన్లు, పరీక్షలు నిర్వహించకూడదని వారికి సూచించారు. ప్రభుత్వంతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మణికొండ: ఆస్పత్రులు, సేవా సంస్థలు నిర్వహించే ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మణికొండ మున్సిపల్‌ చైర్మన్‌ కె. నరేందర్‌ ముదిరాజ్‌ అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్‌ టౌన్‌షిప్‌ ఎంజీ పార్కులో అపోలో షుగర్‌ క్లినిక్స్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన వైస్‌ చైర్మన్‌ కె.నరేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రస్తుతం మనం తీసుకుంటున్న ఆహారంలో సమతుల్యత లేనందునే పలు అనారోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు.

మియాపూర్‌ 1,2 డిపోల్లో డయల్‌ యువర్‌ డీఎం

మియాపూర్‌: ఆర్టీసీ మియాపూర్‌-2 డిపో పరిధిలో శుక్రవారం డయల్‌ యువర్‌ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు డిపో మేనేజర్‌ వెంకటేషం ఓ ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని మియాపూర్‌, బాచుపల్లి, మల్లంపేట్‌తో పాటు నిజాంపేట్‌ పరిసర ప్రాంతాల ప్రజలు ఆర్టీసీ బస్సుల సేవలకు సంబంధించి సమస్యలతో పాటు సూచనలు, సలహాలు ఫోన్‌ ద్వారా తెలియజేయాలన్నారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు 9959226420కు ఫోన్‌ చేయాలని తెలిపారు. అలాగే మియాపూర్‌-1 డిపో పరిధిలో.. శుక్రవారం డయల్‌ యువర్‌ డీఎం కార్యక్రమం జరుగుతుందని డిపో మేనేజర్‌ రామయ్య తెలిపారు. మియాపూర్‌-1 డిపో నుండి తిరుపతి, విశాఖపట్నం, గుంటూరు, బెంగళూర్‌, భద్రాచలం, విజయవాడ, ఒంగోలు, కడప, అనంతపురం, తాడిపత్రి మార్గాల్లో సూపర్‌ లగ్జరీ, రాజధాని, లహరి బస్సులు నడుస్తున్నాయని ఈ రూట్‌లలో ప్రయాణించే ప్రయాణికులు తమ సూచనలు, సలహాలు, సమస్యలు తెలుపాలన్నారు. సాయంత్రం 4 గంటల నుండి 5 గంటల వరకు 9959226153 నంబర్‌కు ఫోన్‌ ద్వారా తెలియజేయాలన్నారు. అదేవిధంగా మియాపూర్‌-1 డిపో నుండి బస్సు ఆన్‌ కాంట్రాక్ట్‌ పద్ధతిన శబరిమలై, తీర్థయాత్రలకు సూపర్‌ లగ్జరీ, రాజధాని,లహరి బస్సులు అద్దెకు ఇవ్వబడునని తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

పటాన్‌చెరు: అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని సీఐఎస్‌ఎఫ్‌ డిప్యూటీ కమాండెంట్‌ సనాతన కృష్ణ అన్నారు. గురువారం పటాన్‌చెరు మండలం భానూర్‌ జెడ్పీహెచ్‌ఎస్‌ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ... అగ్నిప్రమాదం జరిగిన సమయంలో తమని తాము ఎలా రక్షించుకోవాలి, మంటలను ఎలా ఆర్పాలో విద్యార్థులకు చూపించారు.

శిల్పారామం.. హస్తకళా మ్యూజియం

- ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు అందుబాటులో..
- సెలవురోజుల్లో అధిక సంఖ్యలో సందర్శిస్తున్న నగరవాసులు



కొలువుదీరిన హస్తకళా ఉత్పత్తులు

మాదాపూర్‌: కళాకారులు తయారు చేసిన ఆకృతులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఒక్కో ప్రాంతానికి ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. వివిధ ప్రాంతాలలో కళాకారులు తయారు చేసిన కళాఖండాలను మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియంలో పొందుపరిచారు. భావితరాలకు కళాకారుల విశిష్టతను, ఆ ప్రాంతం గొప్పతనాన్ని తెలిపే విధంగా మ్యూజియంను ఏర్పాటు చేశారు. ఇతిహాసాలు, కథలను వర్ణించే విధంగా కళాకృతులను రూపొందించారు. లక్క గాజులు, బంజారా నీడిల్స్‌ క్రాఫ్ట్‌ డోక్ర, బిద్రి వర్క్‌, నలుపు, తెలుపు రంగులో ఇరానీ పద్ధతిలో మెటల్‌ వర్క్‌లు ఆకర్షణగా నిలుస్తున్నాయి. నిర్మల్‌ పెయింటింగ్‌, హైదరాబాద్‌ పెరల్స్‌, వరంగల్‌ నేతన్నల చేనేత ఉత్పత్తులు, అందమైన రంగులలో టై.. డై, ఉత్పత్తులు, పెంబర్తికి చెందిన బ్రాస్‌ ఉత్పత్తులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. బాతిక్‌, గద్వాల్‌ చీరలు ఆకర్షణగా నిలుస్తున్నాయి. టెర్రకోట పోటరీ, బంజారా ఎంబ్రాయిడరీ, కర్ణాటకకు చెందిన ఇత్తడి వస్తువులు, ఉడిపి శంకరాపురకు చెందిన షీట్‌ మెటల్‌ ఉత్పత్తులు, బెంగుళూరు, మైసూర్‌కి చెందిన ఉడ్‌ కార్వింగ్‌, మైసూర్‌ పెయింటింగ్‌, రోజ్‌ వుడ్‌, శ్రీకాకుళంకి చెందిన సాంప్రదాయ బ్రాస్‌ ఉత్పత్తులు, ఏటికొప్పాక, రాజమండ్రి రత్నం పెన్స్‌, విజయనగరానికి చెందిన వీణా, తంబుర ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. కొండపల్లి బొమ్మలు, కలంకారి సహజ డై పెయింటింగ్స్‌ సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి.



శిల్పారామంలోని హస్తకళా మ్యూజియంలో బొబ్బిలి వీణ



గోవా టెర్రకోట బొమ్మలు

శని, ఆదివారాలలో శిక్షణ తరగతులు

ప్రతి శని, ఆదివారాలలో నిర్మల్‌ పెయింటింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్టు నిర్వాహకులు ఎస్‌.పి జ్ఞానేశ్వర్‌ తెలిపారు. వయస్సుతో సంబంధం లేదన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్‌. 9291206584లలో సంప్రదించాలి. రిచ్‌ మండల్‌ పెయింటింగ్స్‌, లిప్పన్‌ ఆర్ట్‌లో శిక్షణ తీసుకోవాలంటే ప్రతి శని, ఆదివారాల్లో 4 గంటల నుంచి 7 గంటల వరకు శిక్షణ తరగతులను నిర్వహించనున్నారు. సి.హెచ్‌ మైత్రేయి. మరిన్ని వివరాలకు 9963467064లలో సంప్రదించాలి.



రాతితో తయారు చేసిన ఆకృతి

కేరళలో ఏనుగుకు అలంకరించే నేటిపట్టం



వెస్ట్‌బెంగాల్‌ కళాకారులు తయారు చేసిన బొమ్మలు





బ్రాస్‌ కళాకృతులు

తప్పులు లేకుండా నమోదు చేయాలి

చందానగర్‌ సర్కిల్‌- 21 ఉపకమిషనర్‌ మోహన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీ మోహన్‌రెడ్డి

చందానగర్‌: సమగ్ర సర్వేను తుది గడువులోగా పూర్తి చేయాలని, తప్పులు లేకుండా ఎన్యూమరేటర్లు జాగ్రత్తగా నమోదు చేయాలని చందానగర్‌ సర్కిల్‌ 21 ఉపకమిషనర్‌ మోహన్‌రెడ్డి సూచించారు. గురువారం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులసర్వేలో భాగంగా చందానగర్‌ డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ భవన్‌లో సూపర్‌వైజర్లు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే పూర్తి చేసిన వాటిని ప్రతి రోజు సూపర్‌వైజర్లు తమ వార్డుకు కేటాయించిన నోడల్‌ అధికారికి అందజేయాలన్నారు. ఎన్యూమరేటర్లు ప్రజలను ఒత్తిడి చేయకుండా వారు తెలిపిన సమాచారాన్ని తప్పకుండా దరఖాస్తులో పొందుపర్చాలన్నారు. వారికి కేటాయించిన టార్గెట్‌ను పూర్తి చేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో చీఫ్‌ ఎగ్జామినర్‌ ఆఫ్‌ అకౌంట్స్‌ నోడల్‌ అధికారి వెంకట్‌రెడ్డి, ప్రాజెక్టు అధికారి ఉషారాణి, కెవిఎస్‌ఎస్‌టి రాజు, విజయ్‌కుమార్‌, కృష్ణ, సూపర్‌వైజర్లు ఉన్నారు.

5 రోజుల్లో 20 శాతం సర్వే పూర్తి.. రేపటినుంచి డేటా ఎంట్రీ షురూ..

సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వే 5 రోజుల్లో 20 శాతం పూర్తి అయిందని ఉన్నతాధికారులు తెలిపారు. ఇంకా 15 రోజుల గడువు ఉందని తుది గడువులోగా సర్వేను పూర్తి చేస్తామన్నారు. నేటి నుంచి సర్వే పూర్తి అయిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో డేటా ఎంట్రీ ప్రారంభిస్తామన్నారు.

నృత్య దీపాంజలి..



మాదాపూర్‌: బాలల దినోత్సవం సందర్భంగా గురువారం శిల్పారామంలో నృత్య ప్రదర్శనలు, డ్రాయింగ్‌, పెయింటింగ్‌ వర్క్‌షాప్‌ నిర్వహించారు. సహాయ ఫౌండేషన్‌, శిల్పారామం సంయుక్త నిర్వహణలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నగర వ్యాప్తంగా దాదాపు 80 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సాత్విక శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో అలరించారు. దీపాంజలి, గణపతి కౌతం, బాల కనకయ్య, బ్రహ్మాంజలి, గరుడగమన తదితర అంశాలను కళాకారులు మోక్ష, సహస్ర, అశ్విని, జాగృతి, రోహిత, శాన్వి, జాహ్నవి, నియతి, హర్షిత తదితరులు ప్రదర్శించారు.

రేపటి నుంచి అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

చందానగర్‌: చందానగర్‌ డివిజన్‌ పరిధిలోని గంగారం జగద్రక్షక శ్రీ ధర్మశాస్త అయ్యప్ప స్వామి ఆలయం దశమ వార్షికోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 16వ తేదీ ఉదయం 5.30 గంటలకు సంకల్పం, గణపతి హోమం, ఉదయం 9.00 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసనం, దీక్షాధారణ ,416 కేజీల పిండి వంటలు నివేదన ,అన్నప్రసాద వితరణ ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు.



'లోక్‌మంథన్‌' పోస్టర్‌ ఆవిష్కరణ

కేపీహెచ్‌బీకాలనీ: శిల్పారామంలో ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు జరగనున్న లోక్‌మంథన్‌- 2024 కల్చరల్‌ ఫెస్టివల్‌ వాల్‌పోస్టర్‌ను జేఎన్‌టీయూలో రిజిస్ట్రార్‌ వెంకటేశ్వరరావు, ఎగ్జామినేషన్స్‌ డైరెక్టర్‌ అరుణకుమారి గురువారం ఆవిష్కరించారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభించిన పార్టీ నాయకుడు రవికుమార్‌ యాదవ్‌ తదితరులు

గచ్చిబౌలి: నానక్‌రాంగూడలో బీజేపీ కార్యాలయాన్ని పార్టీ శేరిలింగంపల్లి ఇంచార్జ్‌ రవికుమార్‌ యాదవ్‌ గురువారం కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను తెలియజేయవచ్చని, ప్రజలకు అందుబాటులో ఉండేందుకే కార్యాలయంను ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు నాగేశ్వర్‌గౌడ్‌, జిల్లా గిరిజన మోర్చ అధ్యక్షులు హన్మంతు నాయక్‌, నాయకులు రాధాకృష్ణ యాదవ్‌, శివా సింగ్‌, వరలక్ష్మీ ధీరజ్‌, మీన్‌లాల్‌ సింగ్‌ పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్‌ రంజన్‌



'రెసోఫెస్ట్‌' కార్యక్రమంలో విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేస్తున్న జయేష్‌ రంజన్‌

చందానగర్‌: 'రెసోనెన్స్‌' ట్రాక్‌ రికార్డు అద్భుతమని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్‌ రంజన్‌ పేర్కొన్నారు. గురువారం గచ్చిబౌలిలోని ఇండోర్‌ స్టేడియంలో రెసోనెన్స్‌ కళాశాల 'రెసోఫెస్ట్‌' అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ రెసోఫెస్ట్‌కు ముఖ్య అతిథులుగా జయేష్‌ రంజన్‌, బొల్లంట్‌ ఇండస్ట్రీస్‌ వ్యవస్థాపకుడు బొల్లా శ్రీకాంత్‌, రెసోనెన్స్‌ ఎడ్యుకేషనల్‌ ఇనిస్టిట్యూషన్స్‌ ఎండీ ఎన్‌.పూర్ణచంద్రరావులు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నపుడే విజయం దక్కుతుందన్నారు. అనంతరం రెసోనెన్స్‌ ఎడ్యుకేషనల్‌ ఇనిస్టిట్యూషన్స్‌ ఎండీ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ఇది కేవలం ఒక వేదిక మాత్రమే కాదని, ప్రముఖులను కలవడం ద్వారా స్ఫూర్తి పొందే అవకాశమన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సత్కరించారు.

ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు చేస్తున్న సిటిజన్‌ ఆస్పత్రి వైద్యులు

చందానగర్‌: చందానగర్‌ పీజేఆర్‌ స్టేడియంలో గురువారం ఫ్రెండ్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో సిటిజన్‌ హాస్పిటల్స్‌ సౌజన్యంతో ఉచిత మధుమేహ, రక్తపోటు, పల్స్‌ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్‌ కన్వీనర్‌ తాడిబోయిన రామస్వామి యాదవ్‌ మాట్లాడుతూ మారుతున్న జీవనశైలి కారణంగా షుగర్‌ పెరుగుతుందన్నారు. సుమారు 100 మందికి పైగా పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ సభ్యులు జిల్‌ మల్లేష్‌, ఉమా చంద్రశేఖర్‌, జనార్ధన్‌, శ్రీనివాస్‌ యాదవ్‌, ఎంఎస్‌ నారాయణ, ఆస్పత్రి ప్రతినిధి జాకీర్‌ హుసేన్‌ తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపనోత్సవాలు

చందానగర్‌ : హఫీజ్‌పేట్‌ డివిజన్‌ పరిధిలోని మదీనాగూడ శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపనోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీ మాధవానంద సరస్వతీ స్వామి ఆశీస్సులతో శోభాయాత్ర నిర్వహించారు. ఈ నెల 15వ తేదీ ఉదయం 8.30 గంటలకు గురు ప్రార్థన, శాంతి పాఠం, గణపతి పూజ ఋత్విక్‌ సన్మానం, అన్నప్రసాద వితరణ ,ప్రాణ ప్రతిష్ఠ జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. అనంతరం 18వ తేదీ ఉదయం 11 గంటలకు సీతారామ కల్యాణం, పార్వతీ పరమేశ్వర కల్యాణోత్సవం జరుగుతుందన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కు అందజేత

చందానగర్‌ : మాదాపూర్‌ డివిజన్‌ పరిధిలోని ఆదిత్యనగర్‌కి చెందిన లియాఖత్‌ అలీకి వైద్య చికిత్స నిమిత్తం మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి రూ. 60 వేలు మంజూరుపత్రాలను గురువారం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యాగులకు అండగా సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసానిస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు ప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం



మిలీనియం స్కూల్‌లో చిన్నారుల సందడి



సరస్వతీ విద్యామందిర్‌లో..



విద్యాంజలి హైస్కూల్‌లో ..

గచ్చిబౌలి: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సంస్కృతి గ్రూప్‌ ఆఫ్‌ స్కూల్స్‌లో నిర్వహించిన కార్యక్రమానికి నీటి వనరుల అభివృద్ధి శాఖ మాజీ చైర్మన్‌ వి.ప్రకాష్‌ ,కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌ యాదవ్‌లు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని సూచించారు. స్కూల్స్‌ చైర్మన్‌ లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

లిటిల్‌ మిలీనియం స్కూల్‌లో..

మసీద్‌బండలోని లిటిల్‌ మిలీనియం ప్రీ స్కూల్‌లో బాలల దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఆట, పాటలతో చిన్నారులు ఉత్సాహంగా గడిపారు. సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్టూన్‌ క్యారెక్టర్లు, పాటలు, నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో లిటిల్‌ మిలీనియం ప్రీ స్కూల్‌ డైరెక్టర్‌ హెలెన్‌, ప్రిన్సిపాల్‌ మోనికా తదితరులు పాల్గొన్నారు.

చందానగర్‌లో..

చందానగర్ : చందానగర్‌ సరస్వతీ విద్యా మందిర్‌లో నిర్వహించిన వేడుకలకు ముఖ్యఅతిథిగా డాక్టర్‌ రమ హాజరయ్యారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, ఫ్యాన్సీ డ్రెస్‌, పాటల పోటీలు జరిగాయి. కార్యక్రమంలో విజ్ఞాన భారతి ప్రధాన కార్యదర్శి నాదెళ్ల పాపారావు, నరేంద్ర ప్రసాద్‌, లోకల్‌ కమిటీ కార్యదర్శి రఘునందన్‌రెడ్డి, సహ కార్యదర్శి రామచంద్రారెడ్డి, ట్రెజరర్‌ నాగభూషణరావు, హెచ్‌ఎం అరుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యాంజలి స్కూల్‌లో..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డోయన్స్‌ కాలనీలోని విద్యాంజలి స్కూల్‌లో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగానిర్వహించారు. వేడుకల్లో భాగంగా చిన్నారులు క్లాసికల్‌, వెస్టర్న్‌ డ్యాన్స్‌లతో అలరించారు. ప్రణవాలయ శాస్త్రీయ, జానపద నృత్యాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌ క్రీడాకారుడు నందగోపాల్‌ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేతలకు సర్టిఫికెట్లు, మెడల్స్‌ను స్కూల్‌ కరస్పాండెంట్‌ ఎల్‌.నర్సింహారెడ్డితో కలిసి అందజేశారు. కార్యక్రమంలో స్కూల్‌ అడ్వైజర్‌ ఎల్‌.మమతా రెడ్డి, ప్రిన్సిపాల్‌ బాలత్రిపురసుందరి పాల్గొన్నారు.

పాఠశాల వార్షికోత్సవం



మాదాపూర్‌: మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో గురువారం కెనరీ ద స్కూల్‌ తొమ్మిదో వార్షికోత్సవంను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో జె.డి.లక్ష్మీనారాయణ, పాఠశాల మేనేజింగ్‌ డైరెక్టర్‌ అరవింద్‌రెడ్డి, చైర్‌పర్సన్‌ డాక్టర్‌ శ్వేతరెడ్డి, ప్రిన్సిపల్‌ లిడియా క్రిష్టినా,హెడ్‌ సీనియర్‌ స్కూల్‌ డాక్టర్‌ నవీన్‌కుమార్‌ ఇమ్మడి, కో ఆర్డినేటర్‌లు అపర్ణ, ముక్త, అడ్మిన్‌ మేనేజర్‌ మహేశ్‌ అక్కం పాల్గొన్నారు.